స్కూళ్లకు నిధుల కేటాయింపు హర్షణీయం

వికారాబాద్, ఆగస్టు 6: పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షణీయమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. మంగళవారం నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.3 నుంచి 20వేల వరకు నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, బసప్ప, ప్రభాకర్, బుచ్చయ్య, పి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శేషవాహన సేవ

ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి శేషవాహన సేవను మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, నిత్యవిధి, సాయంత్రం హనుమంత సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఊరేగించారు. ఈ సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

-ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6



శేషవాహన సేవలో భక్తులు

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల్లోనూ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.


-మేడ్చల్ ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి)



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి

సుంకాలకు సున్నం!

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా అవకతవకలు





రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని కాగ్ ముందుగా పసిగట్టి హెచ్చరించినా అధికారుల్లో మార్పు రావడం లేదు. చేసిన తప్పులనే మళీ మళ్లీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయినా, పట్టించుకునే వారే కరువయ్యారు. సుంకాలు, రుసుముల్లో భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా, రిజిస్ట్రార్లు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారులు ఉద్దేశపూర్వకంగానే అవకతవకలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుముల లెక్కింపులో తేడాలు
- పదే పదే అవే తప్పులు... ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతలు
- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న రిజిస్ట్రార్లు
- సర్కార్ ఆదాయానికి ఏటా రూ. కోట్లలో గండి
- రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తీరుపై 'కాగ్' ఆక్షేపణలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఒకసారి చేస్తే పొరపాటు... మరోసారి చేస్తే తప్పు... పదే పదే అలాంటి తప్పులు చేస్తే ఏమనాలి? ఉద్దేశపూర్వకంగానే చేశారనుకోవాలా? మళ్లీ అదే పొరపాటు చేశారనుకోవాలా?. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూల విషయంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఇలాంటి వాటిని వెలుగులోకి తీసుకువచ్చి 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' హెచ్చరించినా రిజిస్ట్రేషన్ శాఖలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. దీంతో ప్రతి ఏటా ఉమ్మడి జిల్లాలో రూ. కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. 2019 నుంచి 2023 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 'రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వివిధ ప్రభుత్వ శాఖల్లో జరిగిన అవకతవకలను బట్టబయలు చేసిన కాగ్ కొన్ని శాఖల తీరును తీవ్రంగా ఆక్షేపించింది. దస్తావేజులపై తక్కువ సుంకాలు విధించడం, వ్యవసాయేతర భూములకు వ్యవసాయ భూముల విలువ లెక్కించడం.. దస్తావేజుల్లో ఆస్తుల విలువ తగ్గించి సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేయడం దాదాపు శివార్లలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ జరుగుతోంది. దీనివల్ల ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లాలో ఏటా రూ. కోట్ల ఆదాయానికి గండి పడుతోంది. కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి తప్పులు చేస్తూ ప్రైవేటు వ్యక్తులకు మేలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అనేకసార్లు హెచ్చరించినా ఈ తప్పులు జరగడం చూస్తే శాఖాపరంగా సరైన తనిఖీలు జరగకపోవడమేనని 'కాగ్' ఆక్షేపించింది. కాగ్ తనిఖీల్లో బయటపడిన కొన్ని అక్రమాలు, అవకతవకలు ఇలా ఉన్నాయి.

దస్తావేజులపై తక్కువ సుంకాలు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులపై నిబంధనలకు విరుద్ధంగా తక్కువ సుంకాలు వసూలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు చేవెళ్ల, కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట, శంకరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2019-2022కు సంబంధించిన 13 డాక్యుమెంట్లను పరిశీలించిన కాగ్ అధికారులు పలు అవకతవకలను గుర్తించారు. 13 దస్తావేజులపై తక్కువగా సుంకాలు వసూలు చేయడం వల్ల ప్రభుత్వానికి రూ.8.89కోట్ల నష్టం జరిగింది. ఇందులో ఉమ్మడి జిల్లాలోనే అధికంగా నష్టం జరిగింది. ఈ కార్యాలయాల్లో గతంలో కూడా ఈ తప్పులు జరిగాయని, హెచ్చరించినప్పటికీ మళ్లీ ఇప్పుడు అవే తప్పులు పునరావృతమైనట్లు కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ కార్యాలయాలపై సరైన అంతర్గత తనిఖీలు లేనందునే అదే తప్పులు మళ్లీ మళ్లీ అవే అవతవకలు జరుగుతున్నాయని కాగ్ ఆక్షేపించింది. అలాగే వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చిన తరువాత ఉద్దేశపూర్వకంగా వీటి విలువను తగ్గించి వాటిపై సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో 20చోట్ల తనిఖీలు నిర్వహించగా ఇందులో అధికంగా ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మచ్చుకు రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, చేవెళ్ల, కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట, శంకరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొన్ని దస్తావేజులు పరిశీలించగా ఈ విషయాలు బయటపడ్డాయి. మొత్తం రూ.29.46కోట్ల విలువ లెక్కించాల్సి ఉండగా రూ. 6.64కోట్లుగా లెక్కించారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ తగ్గి రూ.1.36 కోట్ల నష్టం జరిగింది. దీనిపై వివరణ కోరగా ఆర్డీఓ కార్యాలయం నుంచి మార్పిడి ఉత్తర్వులు అందనందున వ్యవసాయ భూములుగా పరిగణించి సుంకాలు తీసుకున్నామని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం తీసుకునే విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని కాగ్ పేర్కొంది. ఇలా అధికారులు సమాధానం ఇవ్వడం కూడా అంగీకారం కాదని కాగ్ అభ్యంతరం తెలిపింది. 2022లో వీటిపై వివరణ కోరితే కొందరు అధికారుల నుంచి ఇంకా సమాధానం రాలేదని తెలిపింది.

ఆస్తుల విలువ తగ్గించి..

CAG

అలాగే మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఫరూఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం,. కీసర, పరిగి, పెద్ద అంబర్‌పేట, శామీర్‌పేట బాలానగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, శేరిలింగంపల్లి, తాండూరులలో రిజిస్టరైన దస్తావేజుల్లో ఆస్తుల విలువ తక్కువగా లెక్కించి సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు తక్కువ వసూలు చేశారు. 2019 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2021 మధ్య కాలంలో 22 కేసులను పరిశీలించగా ప్రభుత్వ ఆదాయానికి రూ.1.14 కోట్ల నష్టం జరిగింది. దీనిపై 2023 ఫిబ్రవరిలో వివరణ కోరగా సమాధానమిస్తామని చెప్పినా ఇంత వరకు సమాధానం రాలేదు. గతంలో కూడా మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు బాలానగర్, ఇబ్రహీంపట్నం, శేరిలింగంపలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇదే విధంగా అవకతవకలు జరిగినా ఇంకా పునరావృతమవుతున్నాయని కాగ్ వెల్లడించింది.

కౌలు దస్తావేజులపై తక్కువ రుసుము

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో 2020 నవంబర్‌కు సంబంధించిన రెండు కౌలు దస్తావేజులు పరిశీలించగా వీటికి సుంకాలు తక్కువ వసూలు చేసినట్లు తేలింది. సాధారణంగా 5 నుంచి 10 సంవత్సరాల కౌలుకు సంబంధించిన దస్తావేజులపై వార్షిక అద్దెలో 2శాతం చొప్పున స్టాంప్ డ్యూటీ విధించాలి. కానీ సుంకాలను తప్పుగా లెక్కించి రూ.5.32లక్షల సుంకాలను తక్కువ వసూలు చేశారు.

డీజీపీఏ దరఖాస్తుల్లోనూ ఇలానే..

డీజీపీఏ దస్తావేజుల్లోనూ అవకతవకలు బయటపడ్డాయి. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2019 జనవరి నుంచి 2020 జనవరి వరకు మచ్చుకు మూడు దరఖాస్తులను పరిశీలించగా డీజీపీఏ దస్తావేజులకు రూ.4.56లక్షల సుంకాలు తక్కువ విధించినట్లు తేలింది. దస్తావేజుల్లో నిర్మాణం కోసం ప్రతిపాదించిన మొత్తాన్ని తక్కువగా చూపడం, రిజిస్టరైన ఆస్తులకు మునుపటి అధిక విలువను పరిగణలోకి తీసుకోకపోవడాన్ని కాగ్ అధికారులు గుర్తించారు. దీనిపై వివరణ కోరగా ఇంతవరకు సమాధానం రాలేదు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పదే పదే ఈ తప్పులు జరుగుతున్నాయని గతంలో కూడానే జరిగితే హెచ్చరించామని అయినా, ఇంకా ఇదే ధోరణి కొనసాగుతుందని ఆక్షేపించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం కాకుండా తక్కువ సుంకాలు వసూలు చేశారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు చేవెళ్ల, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2021 ఫిబ్రవరి 2021 ఆగస్టు మధ్య కొన్ని దరఖాస్తులను పరిశీలించగా రూ.81లక్షల తక్కువ సుంకాలు విధించారు. పారిపాసు పద్ధతిన రూపొందించిన దరఖాస్తులకు 0.5 శాతం రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేయాలి. 2021 జూలై, ఆగస్టులో జరిగిన ఈ రుణ తనఖా పారిపాసు దస్తావేజులు పరిశీలించగా 0.5శాతం కాకుండా రూ.పది వేల చొప్పున సుంకం వసూలు చేశారు. హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కారాల్యయంలో తనిఖీ చేయగా రూ.136.85కోట్ల రుణానికి రూ. 68.03 లక్షలు తక్కువ వసూలు చేశారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఎల్బీనగర్, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో దస్తావేజులు తక్కువగా వర్గీకరించడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగింది. 2021 జూలై 2021 సెప్టెంబర్ మధ్యకాలంలో 13 దస్తావేజులు తప్పుగా వర్గీకరించడం వల్ల రూ.26.50లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

కొండ దిగిన కోడి

- అమాంతం పడిపోయిన చికెన్ ధరలు
- ఉమ్మడి జిల్లాలో స్కిన్‌లెస్ రేటు రూ.168
- అమ్మకాలపై శ్రావణ మాసం ఎఫెక్ట్



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 :ఉమ్మడి జిల్లాలో చికెన్ ధరలు అమాంతంగా పడిపోయాయి. వేసవి నుంచి జూలై వరకు కిలోకి రూ. 280 పలికిన చికెన్ ధర ప్రస్తుతం రూ.168కి చేరింది. ఇక స్కిన్‌తో అయితే రూ. 148కే లభిస్తుంది. శ్రావణమాసం ఎఫెక్ట్‌తో ధరలు తగ్గగా.. చికెన్ ప్రియులకు పండుగలా మారింది. కానీ వ్యాపారులు మాత్రం డీలా పడిపోయారు. ధరలు పడిపోవడంతో కోళ్ల ఫారం యజమానులు గిట్టుబాటు కాకపోయినప్పటికీ వచ్చిన కాడికి విక్రయిస్తున్నారు. గత నెల 16న స్కిన్‌తో కేజీ చికెన్ రూ.191 ఉండగా స్కిన్ లేకుండా రూ.218 విక్రయించారు. శ్రావణమాసంలో ఎక్కువమంది పూజలు, వ్రతాలతో మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీనికి తోడు వర్షాకాలం కూడా తోడవ్వడంతో రేట్లు బాగానే తగ్గాయి. దీంతో కోళ్ల ఫారం యజమానులు తమ కోళ్లను దుకాణాలకు తక్కువ ధరకే విక్రయిస్తున్నా కొనేవారు లేరు. దీంతో కోళ్ల పెంపకందారులు, వ్యాపారస్తులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కోళ్లఫారం యజమానులు కోళ్లను పెంచిన తర్వాత నిర్ణీత సమయంలో విక్రయించకపోతే నష్టపోయే ప్రమాదం ఉండడంతో వాటిని వచ్చినకాడికి విక్రయిస్తున్నారు. శ్రావణ మాసం పూర్తయ్యే వరకు ఇటు వ్యాపారస్తులకు, అటు కోళ్ల పెంపకందారులకు గడ్డుకాలం ఉండనుంది.

తగ్గని గుడ్డు ధర

చికెన్ ధరలు భారీగా పడిపోయినా గుడ్డు ధర మాత్రం తగ్గడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ఒక్క గుడ్డును రూ.6కు పైనే అమ్ముతున్నారు. గతంలో రూ.4.50 ఉన్న ధర ఇప్పుడు రూ.6కు చేరుకుంది. మరో పక్క మటన్ ధరలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేజీ మటన్‌కు రూ. 750-1,000 వరకు విక్రయిస్తున్నారు. మటన్ ధరలు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు.



చికెన్ ధరల వివరాలు (కేజీకి రూపాయల్లో)

తేదీ	స్కిన్‌తో	స్కిన్ లేకుండా
ఆగస్టు		
06	148	168
03	158	180
01	168	191
జూలై		
27	183	201
26	183	208
25	194	221
20	191	218
18	184	210
17	180	205
16	191	218

ప్రభుత్వ స్థలాలను రక్షించాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 6: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలకు పూర్తి రక్షణ కల్పించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, యాదాద్రి ప్లాంటేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను ఖాళీగా ఉంచకుండా అక్కడ మొక్కలు నాటాలని, లేదా పిల్లలు ఆడుకోవటానికి పార్కు తయారు చేయాలని సూచించారు. లేదంటే ప్రహరీ ఏర్పాటు చేసి స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అదేశించారు. గతంలో నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలన్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామి, తహసీల్దార్ శైలజ, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

క్రమబద్ధీకరణకు చర్యలేవి?

- సాదాబైనామాలకు మార్గదర్శకాలు కరువు
- నాలుగేళ్లుగా తప్పని ఎదురుచూపులు
- జిల్లా వ్యాప్తంగా 4,443 దరఖాస్తులు
- కులకచర్లలో అత్యధికం... బంట్వారంలో అత్యల్పం

వికారాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెల్ల కాగితంపై రాసుకున్న భూ క్రయ, విక్రయాలకు చట్టబద్ధత కల్పించేందుకు స్వీకరించిన దరఖాస్తులపై కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తెల్ల కాగితాల(సాదాబైనామా)పై జరిగిన భూముల కొనుగోళ్లకు చట్టబద్ధత కల్పించేందుకు 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. కానీ అందుకు మార్గదర్శకాలు జారీ చేయకుండానే ప్రభుత్వ పదవీకాలం ముగిసిపోయింది. దరఖాస్తులు స్వీకరించి నాలుగేళ్లు కావస్తున్నా వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందనేది తేలాల్సి ఉంది. క్రమబద్ధీకరణ కోసం వచ్చిన సాదాబైనామాల దరఖాస్తులపై అప్పట్లోనే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ, అటవీ భూములతో పాటు ఇది వరకు తిరస్కరణకు గురైన సాదాబైనామాల దరఖాస్తులను అధికారులు పక్కన బెట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలో సాదాబైనామాల ద్వారా క్రమబద్ధీకరణ కోసం 4,443 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఎలాంటి సమస్యలు లేని దరఖాస్తులను ప్రభుత్వ పరిశీలనకు సిద్ధంగా ఉంచారు. వాటికి చట్టబద్ధత కల్పించే అంశంలో ఉన్న అడ్డంకులను పరిష్కరిస్తేనే పట్టాపాస్ పుస్తకాల జారీకి మార్గం సుగమమవుతుందని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు.



స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం

సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ జిల్లాలో 2020, నవంబర్ నెలలో 4,443 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కులకచర్ల మండలంలో 505 దరఖాస్తులు రాగా, తక్కువగా బంట్వారం మండలంలో 81 దరఖాస్తులు వచ్చాయి. బషీరాబాద్ మండలంలో 181, బొంరాస్‌పేటలో 315, ధారూరులో 203, దోమలో 417, దౌల్తాబాద్‌లో 315, కొడంగల్‌లో 151 దరఖాస్తులు వచ్చాయి. కోట్‌పల్లిలో 139, మర్పల్లిలో 211, మోమిన్‌పేటలో 298, నవాబుపేటలో 136, పరిగిలో 223, పెద్దేముల్‌లో 315, పూడూరులో 136, తాండూరులో 246, వికారాబాద్‌లో 405, యాలాల్‌లో 166 దరఖాస్తులు వచ్చాయి. ఈ సాదా బైనామాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తే తప్ప ఈ దరఖాస్తుల్లో కదలిక వచ్చే అవకాశం కనిపించడం లేదు.

తొలిసారిగా ఎనిమిదేళ్ల కిందట

తొలిసారిగా 2016లో ఆనాటి ప్రభుత్వం సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టింది. ఐదెకరాల లోపు వ్యవసాయ భూములకు ఉచితంగా పట్టా మార్పిడి చేశారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు తీసుకోలేదు. అయితే అయిదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములకు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని క్రమబద్ధీకరించి పట్టామార్పిడి చేశారు. భూ క్రయవిక్రయాలకు సంబంధించి తెల్ల కాగితంపై రాసుకున్న రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఎవరి నుంచి అభ్యంతరాలు రాకపోతే క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైనట్లుగా భావించాల్సి ఉంటుంది.. పట్టాదారు కుటుంబ సభ్యులు ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే మాత్రం పొలం సరిహద్దుల్లో ఉండే రైతుల వాంగ్మూలం నమోదు చేసుకుని ఫారం-8 నోటీసులు జారీ చేసి సంబంధిత గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు. ఎవరి నుంచైనా అభ్యంతరాలు వస్తే వాటిపై సమగ్ర విచారణ జరిపించి నిబంధనల మేరకు అర్హులకు పట్టా జారీ చేస్తారు.



స్థానికులతో మాట్లాడుతున్న అనితా రామచంద్రన్, కలెక్టర్‌ప్రతీక్ జైన్

తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలి

- పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్

పూడూరు, ఆగస్టు 6 : రక్షిత మంచినీటిని అందించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మిర్జాపూర్, సోమన్‌గుర్తి ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ఆమె కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనితా రామచంద్రన్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పచ్చదనం, వాతావరణ సమతుల్యానికై మొక్కలు నాటాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఐదు రోజుల ఈ కార్యక్రమాల్లో పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలన్నారు. అలాగే టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని శుద్ధి చేసి నాణ్యతను తనిఖీ చేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడ కూడా పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. వారి వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ, మిషన్ భగీరథ ఈఈ బాబు, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో పాండు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

శామీర్‌పేట, ఆగస్టు 6: స్థానిక శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మచ్చందర్‌గౌడ్, రేవతి దంపతులు, శామీర్‌పేటకు చెందిన బండి శ్రీనివాస్‌గౌడ్, రాధ దంపతులు అన్నదానం చేశారు.

ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఆగస్టు 6:ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ మేరకు ప్రతీ నిరుపేద ఎస్సీ కుటుంబానికి రూ.12లక్షల చొప్పున వెంటనే మంజూరు చేయాలని బీజేపీ దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అల్వాల శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. శేఖర్ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ కులాల కార్పొరేషన్లకు ఏడాదికి రూ.750కోట్లు కేటాయించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు అందజేయాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. మోర్చా జిల్లా కార్యదర్శి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రాము, రఘునంధన్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, ఎన్.నర్సింహారెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పాండు, మల్లేష్, వి.మహేశ్, గణేష్, శ్రీశైలం, అశోక్, నర్సింహ, మైసయ్య, ఏసయ్య పాల్గొన్నారు.



యాదాద్రి పార్కులో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 6: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆమె పర్యటించారు. యంనంపేట్ ప్రాథమిక పాఠశాలను, అన్నోజిగూడలోని జడ్పీహైస్కూల్‌లోని మూత్రశాలలను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి యాదాద్రి పార్కును పరిశీలించారు. అనంతరం నారపల్లిలోని జంతుకుటుంబ నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం స్వరూప రాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్ , ఆగస్టు 6: కడ్తాలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అసంపూర్తి భవనాల నిర్మాణాలు పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. కడ్తాలలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. కడ్తాలలో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయానికి రహదారి నుంచి సీసీ రోడ్డుకు రూ.25లక్షలు కేటాయిస్తూ ప్రొసీడింగ్‌ను నాయకులకు అందజేశారు. భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మహిళా సమాఖ్య భవనం పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఆసుపత్రి, జూనియర్ కళాశాల, బస్టాండ్ ఏర్పాటుపై సీఎం దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యా నాయక్, యాట నర్సింహ, బిచ్యానాయక్, శ్రీనివాస్, వెంకటేశ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, స్పెషల్ ఆఫీసర్ రామేశ్వరి, సీఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇక సర్కారు వారి ఇసుక

- మారిన ఇసుక పాలసీ
- తాండూరు సెగ్మెంట్‌లో 7 రీచ్‌ల గుర్తింపు
- బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఫ్రీ
- ఇక అక్రమ రవాణాకు చెక్



తాండూరు/బషీరాబాద్, ఆగస్టు 6: సర్కారు నిర్ణయించిన ధరకే ఇసుక లభించనుంది. ప్రస్తుతమున్న ఇసుక విధానంలో మార్పులు చేస్తూ వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మార్గదర్శకాలను జారీచేశారు. గతనెల 12న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి తాండూరు ప్రాంతంలో సొంతంగా ఎవరికైనా భవన నిర్మాణాలకు ఇసుక అవసరమైతే వేగంగా, సులభంగా ఇసుక అందుబాటులో ఉండేవిధంగా తహసీల్దార్లకు సూచించాలని కోరిన విషయం తెలిసిందే. దీంతో ఇసుక పాలసీలో సవరణ చేస్తూ ఇసుక అందుబాటులో ఉండేలా మార్గదర్శకాలను ఇచ్చారు. ఈ బాధ్యతను మండలాల్లో తహసీల్దార్లకు, మున్సిపాలిటీల్లో కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఇసుక తీసుకెళ్లడానికి సరళతరం చేస్తూనే మరోవైపు అక్రమ ఇసుకరవాణా నియంత్రణకు చర్యలు తీసుకునేలా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

తక్కువ ధర.. బలహీనవర్గాల వారికి ఫ్రీ

బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణానికి, ప్రభుత్వ పథకాలకు ఇసుకధర లేకుండా, రాయల్టీ, ఇతర చట్టపరమైన మొత్తం చెల్లింపుపై ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతించ బడుతుంది. స్థానిక గృహావసరాలకు ప్రభుత్వ పనులకు ఇసుక సరఫరా ప్రాధాన్యత ఇవ్వాలి. ఇసుక విక్రయ ధర రూ.200 లేదా ఒక ట్రాక్టర్ లోడ్‌కు రూ.600 చెల్లించాలి. ఒక రాయల్టీ-120, డీఎంఫ్-36, ఎస్ఎంఈటీ-24, సీటి పన్ను-24, అమ్మకం పన్ను-120, మొత్తం-330లు చెల్లించాల్సి ఉంటుంది. డీడీ రూపంలో కలెక్టర్ వికారాబాద్ పేరిట డీడీ ఇవ్వాలి.

అక్రమ రవాణా, నియంత్రణకు చర్యలు

ఇసుక వెలికితీత, అక్రమ రవాణాను నియంత్రించడానికి కార్యాచరణ మార్గదర్శకాలను జారీ చేశారు. సరైన పరిపాలన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీలో స్థానిక అధికారులకు పర్యవేక్షణకు నియమించాలి. ఇసుక రవాణాకు సంబంధించి ప్రాజెక్టు పని, డిపార్ట్‌మెంట్ పేరు, ప్రాజెక్టు స్థానం, వివరాలను పేర్కొంటూ వేబిల్లు జారీచేయాలి. వేబిల్లును సూపర్‌వైజర్ ధ్రువీకరించాలి. ట్రాక్టర్లు మాత్రమే రవాణాకు అనుమతించబడుతాయి. పోలీసు, రవాణాశాఖ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట నిర్మాణ పనుల స్థలంలో మరెక్కడా ఇసుక నిల్వ చేయరాదు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే రవాణా సమయం, చెక్ పాయింట్లు ఏర్పాటుచేసి యంత్రాంగాన్ని నియమించాలి. ట్రాకర్ల వివరాలను తహసీల్దార్‌కు అందజేయాలి. రూ.25వేల నుంచి రూ.50వేల వరకు సెక్యూరిటీ డిపాజిట్‌ను పెట్టాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు ఈ మొత్తాన్ని జమ చేస్తారు. ఇసుక వెలికితీత, లోడింగ్ పాయింట్ వద్ద పంచాయతీ కార్యదర్శి రిజిష్టర్‌ను నిర్వహించాలి. వారానికో సారి వివరాలను తహసీల్దార్‌కు అందజేయాలి. తహసీల్దార్ ఆ వివరాలను కలెక్టర్‌కు నివేదించాలి. ఇసుక వెలికితీత(రీచ్) వద్ద కూలీల మాస్టర్ రోల్ నిర్వహణతో పాటు అట్టి వేతనాన్ని బ్యాంకు అకౌంట్ ద్వారా చెల్లించాలి. స్వాధీ నం చేసుకున్న ఇసుకను విక్రయధర, చట్టబద్ధమైన మొత్తాలను చెల్లించిన వారికి అందజేయాలి.

ఏడు రీచ్‌ల గుర్తింపు

వికారాబాద్ జిల్లాస్థాయి కమిటీ కాగ్నానది పరివాహక ప్రాంతంలోని ఏడు ఇసుక రీచ్‌లను గుర్తించింది. మొత్తం 90,384 క్యూబిక్ మీటర్ల (సీబీఎం) ఇసుక మాత్రమే తవ్వాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బషీరాబాద్ మండలం నవాంద్గిలో 14,720 సీబీఎం, గంగ్వార్‌లో 19,610 సీబీఎం, తాండూరు మండలం 19,920 సీబీఎం, పెద్దేముల్ మండలం రేగోండిలో 3003 సీబీఎం, కొండాపూర్‌లో 3315 సీబీఎంల ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చారు. ఇంతకంటే ఎక్కువ తవ్వకాలు జరిపితే అధికారులపై చర్యలుంటాయని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్

దోమ, ఆగస్టు 6: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాధులపై పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జీవరాజ్, హనుమంతరావు, మహేశ్‌బాబు, సోమలింగం, వైద్యాధికారులు రజిత, నిరోష, నేహ, పవిత్ర, ప్రవీణ్, విజయలక్ష్మి, ప్రభులింగం, రేణు కుమార్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, వాణి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు షెడ్లు

తాండూరు మున్సిపాలిటీకి 25 మంజూరు

రూ.9.50లక్షలు కేటాయింపు • స్థల అన్వేషణలో మెప్మా సిబ్బంది



షెడ్ల మోడల్

తాండూరు, ఆగస్టు 6: వీధి వ్యాపారులకు చేయూతనిచ్చే కార్యక్రమాలకు మెప్మా ప్రాజెక్టు శ్రీకారం చుట్టింది. వీధి వ్యాపారులు రోడ్లపై అమ్మకాలు చేయొద్దనే ఉద్దేశంతో షెడ్లను నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మొదటగా తాండూరు మున్సిపాలిటీని ఎంపిక చేసింది. వ్యాపార కేంద్రంగా ఉన్న తాండూరులో ముందుగా చేపట్టి తర్వాత లోటు పాట్లను సవరించిన తర్వాత ఇతర మున్సిపాలిటీల్లో చేపట్టనున్నారు. తాండూరు మున్సిపాలిటీలో 25షెడ్ల నిర్మాణానికి రూ.9లక్షల 50 వేలు మంజూరయ్యాయి. 50శాతం నిధులు రూ.4లక్షల 75వేలు నిధులను అడ్వాన్స్‌గా మెప్మా అకౌంట్‌లోకి రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు జమ చేశారు. తాండూరు మున్సిపాలిటీలో పాత మున్సిపాలిటీ ముందుకు షెడ్లు నిర్మించాలని మెప్మా జిల్లా అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కాకుండా మరోస్థలాన్ని ఎంపిక చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మెప్మా సిబ్బందికి సూచించినట్లు సమాచారం. తెలంగాణ స్ట్రీట్ వెండింగ్ స్కీం-2016 కింద పట్టణ ప్రగతి ప్రోగ్రాం కింద ఈ షెడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. స్ట్రీట్ వెండర్స్ జోన్ల ఎంపికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఒక్కొక్క షెడ్డు 6.6ఫీట్లు, ఎత్తు 10ఫీట్లు, ప్లాట్ ఫామ్ రెండు ఫీట్లు, అండర్ గ్రౌండ్ బెస్‌మెంట్ మూడు ఫీట్లు, ఒక్కరు ఎస్ఎఫ్‌టీకి రూ.848ఖర్చవుతుందని అంచనా వేశారు.

భూములివ్వాలని ఒత్తిడి చేస్తే ఊరుకోం



కుర్మిద్దలో రైతులతో మాట్లాడుతున్న సరస్వతి

యాచారం, ఆగస్టు 6: భూములివ్వాలని రెవెన్యూ అధికారులు రైతులకు ఫోన్‌లు చేసి ఇబ్బంది పెడుతున్నారని, ఇది మంచిది కాదని ప్రముఖ పర్యావరణవేత్త కవుల సరస్వతి పేర్కొన్నారు. రైతుల జోలికొస్తే తాము ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకిచ్చిన మాటమీద నిలబడాలన్నారు. మళ్లీ భూములను తీసుకునేందుకు యత్నించడం సరికాదన్నారు. మంగళవారం కుర్మిద్దలో నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2,500 ఎకరాల సర్వే నంబర్లను ధరణి పోర్టల్‌లో టీఎస్ఐఐసీ పేరిట నమోదు చేయడంతో రైతులకు ప్రభుత్వాల పథకాలేవీ రావడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని నాయకులు హామీ ఇచ్చారన్నారు. నిషేధిత జాబితా నుంచి వెంటనే భూములను తొలగించకుంటే ఉద్యమం లేవదీస్తామన్నారు. అసలు ఫార్మాసిటీని రద్దు చేశారా? లేదా? అనే దానిపై స్పష్టత ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారులు రైతులపై ఒత్తిడి తేకుండా కాంగ్రెస్ నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సునీత కుటుంబానికి న్యాయం చేయాలి



నిరసన ర్యాలీలో విశారదన్

షాద్‌నగర్, ఆగస్టు 6 : చోరీ కేసులో అరెస్టు చేసి థర్డ్ డిగ్రీతో చిత్రహింసలకు గురిచేసిన సునీత అనే దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం డీఎస్‌పీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ షాద్‌నగర్‌లో సునీతను పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో ప్రధాన కూడలికి చేరుకొని అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేశారు. మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డీఐ రామిరెడ్డిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విశారదన్ పట్టణ ప్రధాన కూడలిలో చేపట్టిన ఆకస్మిక దీక్షతో గంటన్నర పాటు ట్రాఫిక్ స్తంభించింది.

'నాగేందర్ కుటుంబానికీ న్యాయం చేయండి'

బంగారం, నగదు అపహరణకు గురైన నాగేందర్ కుటుంబానికి కూడా న్యాయం చేయాలని నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం షాద్‌నగర్ అంబేడ్కర్ కాలనీలో ఉంటున్న నాగేందర్ ఇంటికి చేరుకుని వాస్తవాలను సేకరించింది. కమిటీ సభ్యులు పి.రఘు మాట్లాడుతూ.. సునీతను పోలీసులు కొట్టడాన్ని తాము కూడా వ్యతిరేకిస్తున్నామన్నారు. అదే సందర్భంలో నాగేందర్ ఇంట్లో చోరీకి అయిన బంగారం, నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని బాధిత కుటుంబానికి అందజేయాలని డిమాండ్ చేశారు. రెండు కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు. సునీతను పరామర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో జరిగిన విషయాలను ఇక్కడ మాట్లాడం సిగ్గుచేటన్నారు. రాజకీయ లబ్ధికోసమే వారు సునీతను పరామర్శించారని విమర్శించారు. కమిటీ మరో సభ్యుడు జగన్ మాట్లాడుతూ ఒక పద్ధతి ప్రకారం జరగాల్సిన విచారణను బీఆర్ఎస్ పక్కదారి పట్టిచ్చిందని అన్నారు.

పిల్లల ఎదుట తల్లిదండ్రులు ఫోన్లు వాడొద్దు



కొడంగల్, ఆగస్టు 6: పిల్లలు ఉన్నప్పుడు తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఆర్యజనని నిర్వాహకులు డాక్టర్ అనుపమరెడ్డి సూచించారు. కొడంగల్ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రామకృష్ణ మఠం ఆర్యజనని ఆధ్వర్యంలో గర్భిణులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, వైద్యులు దాసప్పయాదవ్, రవీంద్రయాదవ్, చంద్రశేఖర్, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

షాద్‌నగర్, ఆగస్టు 6: రాష్ట్రంలోనే షాద్‌నగర్ మున్సిపాల్టీని ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణ మున్సిపల్ పరిధిలోని రతన్ కాలనీ, అంజయ్య కాలనీలో రూ.25లక్షలతో చేపట్టబోయే రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కౌన్సిలర్ సరితాయాదవ్, మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం తదితరులు పాల్గొన్నారు.

డీటీవోను కలిసిన ఎస్టీయూటీఎస్ నాయకులు



డీటీవో పద్మావతిని కలిసిన ఎస్టీయూటీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6: జిల్లా ట్రెజరీ ఆఫీసర్‌గా కలెక్టరేట్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న పద్మావతిని మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పండిట్, పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ, అప్ గ్రేడ్‌కు సంబంధించి క్యాడర్ స్ట్రెంత్ సమాచారం సబ్‌ట్రెజరీ అధికారులకు అందించాల్సిందిగా వారు ఆమెను కోరారు. స్పందించిన ఆమె సమాచారం అందిస్తామని తెలిపారు. వీరి వెంట ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సుధాకర్, రాజమణి, పరమేశ్, భాస్కర్ ఉన్నారు.

టెండర్ల జాప్యం ఇంకెంతకాలం?

- దుకాణాల కేటాయింపునకు గడువు ముగిసినా చోద్యం
- మూడు నెలలుగా టెండర్లు పిలవని వైనం
- అధికారపక్షం జోక్యంతో ఆలస్యం
- లోలోపల కేటాయింపునకు లాబీయింగ్



పరిగిలో మున్సిపాలిటీకి చెందిన దుకాణాలు

పరిగి, ఆగస్టు 6: పరిగి పట్టణంలో గల మున్సిపల్ శాఖ చెందిన వాణిజ్య సముదాయం దుకాణాల కేటాయింపులో నిబంధనలకు పాతరేస్తున్నారు. గతంలో కేటాయించిన దుకాణాల గడువు ముగిసినా రీటెండర్ వేయకుండా కాలం వెళ్లదీస్తున్నారు. దుకాణాల్లో ఏళ్లగా తిష్టవేసిన వ్యాపారులు పాలకులు, అధికారులను ప్రభావితం చేస్తున్నారు. అధికారులు, పాలకులు కూడా నిబంధనలకు విరుద్ధంగా లోలోపల అనర్హులకు కేటాయిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ దుకాణాలను చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి పొందేందుకు కేటాయించాల్సి ఉంటుంది. అయితే అధికారులు మాత్రం టెండర్‌లో ఎవరు ఎక్కువ అంటే వారికే కేటాయిస్తున్నారు. పరిగి మునిసిపాలిటీకి 27దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలు కూడా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉండడంతో మంచి డిమాండ్ ఉంటుంది. అయితే గతంలో టెండర్ ద్వారా కేటాయించిన దుకాణాల గడువు గత ఏప్రిల్ చివరినాటికి ముగిసింది. తిరిగి టెండర్ వేయాల్సి ఉంది. గడువు ముగిసి మూడునెలలు గడిసినా టెండర్ల గురించి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుకోవడం లేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు. అయితే నాయకులు, అధికారులు కలిసి లోలోపల తమకు అనుకూలంగా ఉన్నవారికి కేటాయించేందుకు టెండర్లు వేయడంలేదని చెబుతున్నారు. టెండర్ల ప్రక్రియ వేయకపోవడంలో పాలకవర్గంతో పాటు, అధికార పార్టీ ప్రజాప్రతినిధి కూడా దుకాణాల కేటాయింపులో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నారు. అయితే ఇలా రాజకీయ జోక్యంతో వారికి ఇష్టం వచ్చినవారికి కేటాయించాలని లోలోపల మాట్లాడుకుంటున్నారని వాపోతున్నారు. దుకాణాల కేటాయింపులో అధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లతో ఏం చేయలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాలను నిరుద్యోగులకు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపెన్ టెండర్ పెట్టాలి



మునిసిపల్‌కు చెందిన దుకాణాలకు ఓపెన్ టెండర్ వేయాలి. గడువు ముగిసి మూడు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే టెండర్లు వేసి జనాభా ప్రతిపాదికన అర్హులకు కేటాయించాలి. నిరుద్యోగులకు కేటాయిస్తే స్వయంఉపాధి పొందుతారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎం.వెంకటయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

జ్యూరిడిక్షన్ విలువ తగ్గించొద్దు



ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, ఆగస్టు 6: ప్రభుత్వం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధి జ్యూరిడిక్షన్ స్థాయిని రూ.20లక్షల నుంచి రూ.10లక్షలకు తగ్గించడం సరికాదని ఆమనగల్లు బార్ అసోషియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం ఆమనగల్లు కోర్టు వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం సవరణలను వెంటనే ఉపసంహరించుకుని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు స్థాయిని యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. బార్ అసోషియేషన్ సభ్యులు ఆర్డీవో సూరజ్‌కుమార్, ఆమనగల్లు తహసీల్దార్ లలితలకు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, న్యాయవాది యాదీలాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు రామకృష్ణ, మధు, శేఖర్, కృష్ణ, మల్లేశ్, గణేశ్, సంతోష్‌కుమార్, దేవేందర్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఆసుపత్రి?

- కాలికి గాయమై వస్తే అయోడిన్ లేదంటారా..?
- బషీరాబాద్ సీహెచ్‌సీలో రైతును పట్టించుకోని వైద్య సిబ్బంది
- ఆందోళనకు దిగిన బాధితుడు




కాలిదెబ్బను చూపిస్తున్న కుర్వ కనకయ్య

బషీరాబాద్, ఆగస్టు 6: అయోడిన్ లేకుంటే గాయాలపాలైన వారికి ఏం చికిత్స చేస్తారంటూ బషీరాబాద్ (సీహెచ్‌సీ) కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్స కోసం వచ్చిన ఓ బాధిత రైతు మంగళవారం ఆందోళనకు దిగారు. 15రోజుల కిందట ఆసుపత్రికి వస్తే తనను పట్టించుకోకపోతే తానే స్వయంగా కాలిదెబ్బకు డ్రెస్సింగ్ చేసుకుని వెళ్లానని తెలిపాడు. ఇప్పుడొస్తే అసలు అయోడిన్ లేదంటున్నారని, వైద్యులు అందుబాటులో లేకుంటే ఎవరికి చెప్పుకోవాలని వైద్యసిబ్బందిపై మండిపడ్డాడు. అంతలోనే హెడ్ నర్సు ఒకరు వచ్చి కాలికి గాయమై వచ్చిన జీవన్గికి చెందిన రైతు కూర్వ కనకయ్యకు అయింట్‌మెంట్ పూయించుకోమని సలహా ఇచ్చింది. ఇదిలా ఉండగా కొత్తగా వచ్చిన ఇద్దరు డాక్టర్లు ఎక్కడున్నారంటూ విలేకర్లు ఆరా తీయగా ఒకరు మధ్యాహ్న భోజనానికి వెళ్లారని, మరో డాక్టర్ ఆసుపత్రి పనిపై వెళ్లడంతో రాలేదని చెప్పుకొచ్చారు. అప్పటికే చికిత్స కోసం వచ్చి వేచి చూస్తున్నా కొందరు ఇంకెక్కడి డాక్టర్ 12గంటలకే ఒకరు వెళ్లిపోయారని గుసగుసలాడుకున్నారు. ఈ ఆసుపత్రి స్థాయి పెంచినా పేదలకు ఏం లాభంలేదని, వైద్యులు ఎవరూ సక్రమంగా ఉండరంటూ చికిత్స కోసం వచ్చిన బాధితులు ఆరోపించారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో భోజనానికి వెళ్లి తిరిగి వచ్చిన ఆయూష్ డాక్టర్ సురేష్‌ను మిగతా ఇద్దరి వైద్యుల విషయమై అడగగా సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు. అప్పటికే చికిత్స కోసం వచ్చిన బాధితులు వైద్యుడిని చుట్టుముట్టడంతో అతడు వైద్యసేవలు అందిచడంలో మునిగిపోయారు. ఏదిఏమైనా ప్రస్తుతం ఈ ఆసుపత్రికి ఆయూష్ డాక్టర్ మాత్రమే పెద్దదిక్కుగా మారి వైద్య సేవలు అందిస్తున్నారని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

సర్కారు భూమిలో ప్రైవేటు రోడ్డు



ప్రభుత్వ భూమిలో రియల్టర్లు వేసిన సీసీ రోడ్డు



అధికారులతో రియల్టర్లు, కాలనీవాసుల వాగ్వాదం

- తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న రియల్టర్లు
- వెంచర్లలో తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం
- వాగ్వాదానికి దిగడంతో వెనుదిరిగిన అధికారులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 6: ప్రైవేట్ వెంచర్ల లబ్ధి కోసం ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీరోడ్డును తొలగించడానికి వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. జేసీబీ, పోలీసు బందోబస్తుతో మంగళవారం ఆ వెంచర్ వద్దకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రియల్టర్లు, కొందరు స్థానికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ఉట్టిచేతులతో వెనుదిరిగారు. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ పట్టణం నుంచి కిష్టాపూర్ వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఓ వెంచర్‌కు రోడ్డు లేకపోవడంతో వారు దొంగ చాటుగా మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 145లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నేరుగా ఆ వెంచర్ లోపలికి వెళ్లేలా తొలత తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక అడిగే వారు లేరంటూ తర్వాత పక్కాగా సీసీ రోడ్డు వేసి వెంచర్‌కు ప్రధాన రోడ్డుకు కలిపేందుకు సిద్ధమయ్యారు. దీంతో పలువురు స్థానికులు రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ జరపడానికి ఆదేశించగా మంగళవారం రెవెన్యూ అధికారులు ఆ సీసీ రోడ్డును తొలగించటానికి వెళ్లారు. కాగా, తాము ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేయలేదంటూ రియల్టర్లు కొంతమంది మద్దతుదారులతో కలిసి అధికారులను అడ్డుకున్నారు. రోడ్డు వేసిన స్థలం పక్కాగా ప్రభుత్వానిదే అంటూ రెవెన్యూ సిబ్బంది రియల్టర్లకు తెలిపినా వారు సర్వేచేసి రోడ్డును తొలగించాలన్నారు. కాగా సర్వే నంబర్ 145లోని ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేశారన్న కచ్చితమైన ఆధారాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపినా రియల్టర్లు వినకుండా జేసీబీకి అడ్డంగా పడుకున్నారు. కాగా వెంచర్ వద్ద రోడ్డు ఏర్పాటు చేసిన స్థలం ప్రభుత్వానిదని స్థానికులు కొందరు అనడం గమనార్హం. ఈ వెంచర్‌కు మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డు నుంచి అప్రోచింగ్ రోడ్డు లేదన్న విషయం అందరికీ తెలిసిందని కాగా ప్లాట్లు విక్రయించిన రియల్టర్లు గతంలో అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చి తాత్కాలిక మార్గం ఏర్పాటుచేసి అమాయకప్రజలకు ప్లాట్లు విక్రయించారని స్థానికులు ఆరోపించారు. దీనికి తోడు మేడ్చల్-కిష్టాపూర్‌కు రోడ్డువైపు ఉన్న కొన్ని ప్లాట్లు ప్రభుత్వ స్థలానికి ఆనుకుని ఉన్నట్లు స్థానికులు తెలిపారు. రియల్టర్లు కొంత మంది స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అమాయక ప్రజలను మోసం చేసి అప్రోచింగ్ రోడ్డు లేని వెంచర్ తయారు చేసి ప్లాట్లను విక్రయించి చివరికి ప్లాట్లు కొన్న వారిని సైతం మోసం చేశారంటూ కొందరు ఆరోపించారు. కోట్ల విలువున్న ప్రభుత్వస్థలాన్ని కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కడినుంచో వచ్చిన రియల్టర్లుకు దాసోహం పలకటంతో ఉన్న కాస్త ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్లాట్లు కొన్న వారిని, ప్రభుత్వాన్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా వెంచర్‌లోని కొన్ని ప్లాట్లు హెచ్ఎండీఏ ముసాయిదా ప్లాన్‌లో 100ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అట్టి స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించారని కొందరు ఆరోపించారు. వెంచర్‌లో చేసిన తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి రియల్టర్లు ప్రస్తుతం ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు వాపోయారు.

స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే వరకూ వదలం

ప్రభుత్వం స్థలాన్ని కబ్జా చేసి లేఅవుట్‌లో రోడ్డు చూపించి ప్లాట్లుగా విక్రయించిన రియల్టర్లపై చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. రోడ్డు వేసిన స్థలం కచ్చితంగా ప్రభుత్వ స్థలంగా మావద్ద ఆధారాలు ఉన్నాయి. ఆ రోడ్డును తొలగించడానికి మా సిబ్బంది వెళ్లారు. సర్వేచేసి ప్రభుత్వస్థలాన్ని తమ ఆధీనంలో తీసుకుంటాం. పాట్లు ఉన్న, రోడ్డు వేసిన స్థలాన్ని మాత్రం వదిలే ప్రసక్తి లేదు. ప్రభుత్వ స్థలాన్ని రోడ్డుగా చూసి ప్లాట్లు విక్రయించిన వారి పట్ల బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

- శైలజ, మేడ్చల్ తహసీల్దార్

మున్సిపాలిటీగా మహేశ్వరం?

విలీనం కానున్న పలు పంచాయతీలు

జీవో ఇప్పించే ప్రయత్నంలో అధికార పార్టీ నాయకులు



మహేశ్వరం గ్రామ ముఖచిత్రం

మహేశ్వరం, ఆగస్టు 6: మహేశ్వరం, మండలంలోని సిరగిరిపురం, గంగారం, గంగారంతండా, మన్‌సాన్‌పల్లి, ఆకన్‌పల్లి, గట్టుపల్లి, ఉప్పుగడ్డతండా, కొత్తతండా, కేసీతండా, డీజీతండా, ఎన్డీతం డా, కేబీతండా, తుమ్మలూరు, మొహబత్‌నగర్ గ్రామాలను కలుపుకొని మహేశ్వరం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటుకు ముమ్మర యత్నాలు సాగుతున్నాయి. మహేశ్వరం మండల కేం ద్రం, గ్రామాలు, తండాలు కలుపుకొని మొత్తం 20వేలకుపైగా జనా బా ఉంది. వచ్చే అక్టోబర్‌లో పంచాయతీ ఎన్నికలు, అనంతరం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల కోడ్ రాకముందే మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా చేసేందుకు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ సంబంధిత ఫైలును ఇప్పటికే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అప్పగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన నుంచి రాగానే మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ఫైలుపై సీఎం సంతకం చేసే అవకాశాలున్నాయని కేఎల్లార్ పేర్కొంటున్నారు. పంచాయతీలుగా ఉన్న పల్లెలు ఆ పిలుపులకు దూరమై మున్సిపల్ వార్డులు కానున్నాయి. మహేశ్వరం మున్సిపాలిటీగా మారనుందనే వార్తలు మహేశ్వరం వాసుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. తుక్కుగూడ, రావిరాల, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాలను కలుపుకొని ఐదేళ్ల కింద తుక్కుగూడ కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పడింది. అదే తరహాలో ఇప్పుడు మహేశ్వరాన్నీ మున్సిపాలిటీ చేయాలని కొందరు కాంగ్రెస్ నాయకులు కేఎల్లార్‌పై ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు. రియల్ ఎస్టేట్‌తో ఇప్పటికే గుర్తింపు పొందిన మహేశ్వరం మున్సిపాలిటీ అయి తే మరింత అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ నాయకులు పాలకుల వద్ద ప్రతిపాదన పెట్టారనే వార్తలొచ్చాయి. మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రితో మాట్లాడాలని స్థానిక నాయకులు కేఎల్లార్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం త్వరలోనే మున్సిపాలిటీగా అవతరించనుందనే వార్తలు జోరందుకున్నాయి.


వికారాబాద్: జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి


తాండూరు: ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న


మేడ్చల్ టౌన్: జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి


మర్పల్లి: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


శామీర్‌పేట్: అలియాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


నవాబుపేట: ప్రభుత్వ జూనియర్ ప్రొఫెసర్ జయశంకర్‌కు కళాశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు


ధారూరు:ధారూరులో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సాజిదా బేగం


దోమ: జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి హనుమంతరావు


ఘట్‌కేసర్: జడ్పీ బాలుర హైస్కూల్‌లో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కొడంగల్: కడా కార్యాలయంలో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు


కొడంగల్ రూరల్: పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో జయశంకర్‌కు నివాళులు


బషీరాబాద్: పోలీస్‌స్టేషన్‌లో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌కుమార్, సిబ్బంది


ఘట్‌కేసర్ రూరల్: ఘనాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో గీతారెడ్డి


పరిగి: జడ్పీహెచ్ఎస్ 2లో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


బొంరాస్‌పేట్: జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీవీవీ నాయకులు


తాండూరు రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

చెరువులు, కుంటలను పరిరక్షించాలి


శామీర్‌పేట్: ఉప్పరిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జాన్ శ్యాంసన్

శామీర్‌పేట, ఆగస్టు 6 : గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని, ఖాళీస్థలాల్లో విరివిగా మొక్కలను నాటి పర్యావరణాన్ని బాధ్యతగా పరిరక్షించాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డైరెక్టర్ జాన్ శ్యాంసన్ ప్రజలకు పిలుపునిచ్చారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పరిపల్లిలో మంగళవారం రెండోరోజు మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరిపల్లి పరిధిలోని పల్లె చెరువును, పరిసరాలను మున్సిపల్ అదనపు డైరక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావులు సందర్శించి పరిశీలించారు. ఉప్పరిపల్లిలో నీటి సంపును, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషలాఫీసర్ వాణి, మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్షపు నీటిని వృథాగా పోనివ్వొద్దు

వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ఇంకుడు గుంతల్లోకి మళ్లించి భూగర్భజలాలను పెంచాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా డిప్యూటీ కలెక్టర్ సైదులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో రోజు మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలో మండల స్పెషలాఫీసర్ సైదులు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకయ్య, డీఆర్‌డీఓ సాంబశివరావు, ఎంపీడీవో మమతబాయి పాల్గొన్నారు.

వికారాబాద్: 24వ వార్డులో స్థానిక కౌన్సిలర్ శ్రీదేవిసదానందరెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, నాయకులు సదానందరెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, కాలనీ వాసులు ఉన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కమిషనర్ సాబేర్ అలీ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్లతో కలిసి పరిసరాలను శుభ్రం చేసి తగు నీటిని సరఫరా చేసే సంపులు, ట్యాంకుల వద్ద చెత్త చెదారం లేకుండా చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి ఆధ్వర్యంలో ట్యాకులవద్ద చెత్తా చేదారం తొలగించి నీటిలో బ్లీచింగ్ ద్రావణాన్ని కలిపారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

బషీరాబాద్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జీవన్గి అర్‌అం డ్‌బీ రోడ్డులో బషీరాబాద్ ఎంపీడీవో గాలియాదయ్య సిబ్బందితో కలిసి మంగళవారం మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్, గ్రామ కార్యదర్శి జయకార్, ఎపీవో శారద పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో పర్యటించి స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డిప్యూటీ సీఈవో నీరజ పాల్గొని తాగునీటి పరీక్షలు చేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళిర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వత్సలాదేవి, ఎంపీవో మంగతయారు పంచాయితీ కార్యదర్శి శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండలంలోని సురయిపల్లిలో సీజనల్ వ్యాధులపట్ల కొడంగల్ సబ్ యూనిట్ ఫైలేరియా అధికారి పకీరప్ప వైద్యసిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఓ చిన్నారికి డెంగ్యూ లక్షణాలు నిర్ధారణ కావడంతో మంగళవారం గ్రామంలోని కాలనీల్లో దోమల నివారణకు మందును పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం

తాండూరు: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలో నున్న మంచి నీటి వనరులైన ఈఎల్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులను, మీనిట్యాంకులు చుట్టూ నాచు పట్టి అపరిశుభ్రంగా ఉండేది. వాటిని మంగళవారం మున్సిపాలిటీలోని వార్డు అధికారుల ఆధ్వర్యంలో ప్రతీవార్డులో మినీ ట్యాంకులను శుభ్రం చేయించారు. మున్సిపాలిటీలో డీఈఈ ఖాజా హుసేన్ క్లోరినేషన్ స్థాయిలపై వార్డు ఆఫీసర్లు, సిబ్బందికి అవగాహన కల్పించారు. వార్డుల్లో మినీ ట్యాంకులు, పరిసరా ప్రాంతాలను శుభ్రం చేయించారు. తాగు నీటిపరీక్షలు (క్లోరినేషన్) టెస్టింగ్ కిట్‌లతో పరీక్షించారు. రిపోర్టులను సంబంధిత అధికారులకు పంపించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, వార్డు ఆఫీసర్లు యాదగిరి, ఉమేష్, రాములు, సునీత, నర్మద, రవీందర్, సీహెచ్ నాగేందర్, నిరీక్షణ, కౌన్సిలర్ సంగీతా ఠాకూర్, అంతారం లలిత పాల్గొన్నారు.


ట్యాంకు శుభ్రం చేయడానికి ముందు..


ట్యాంకు శుభ్రం చేసిన తర్వాత..

సమయానికి బస్సులు నడపాలి

తాండూరు, ఆగస్టు 6: పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు అనుగుణంగా సమయానికి బస్సులు నడపాలని విద్యార్థినీ విద్యార్థులు మంగళవారం తాండూరు బస్ డిపో ఎదుట ధర్నాకు దిగారు. మండలంలోని జుంటుపల్లి, పగిడిపల్లి, అక్కంపల్లి, కోడంగల్ మండలం రుద్రారం నాగారం గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది విద్యార్థులు డిపో ముదు బైఠాయించి సమయానికి బస్సులు నడపాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న బీసీ సంఘం నాయకులు లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. డీఎం సురేష్ కుమార్ విద్యార్థులు, లక్ష్మణ్‌కుమార్‌తో చర్చించి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు

కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేత


ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ

కొడంగల్, ఆగస్టు 6: కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా మంగళవారం హైదరాబాద్‌లో ప్రశంసా పత్రం అందుకున్నారు. 2023లో సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో సీఐ శ్రీధర్‌రెడ్డి ఓ హత్యకేసును ఛేదించి పరిశోధన అనంతరం చార్జ్‌షీట్ వేయగా వాదోపవాదాలు విన్న సంగారెడ్డి న్యాయస్థానం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

సంక్షిప్తంగా..

● **తాండూరు:** తాండూరు, పెద్దేముల్ , బషీరాబాద్ మండలాలతో పాటు తాండూరు మున్సిపల్ పరిధి పాత తాండూరులో నేడు ఉదయం 8గంటల నుంచి 9-30 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

● **తాండూరు:** గాంధీనగర్‌లో ఇటీవల ప్రారంభించిన డ్వాక్రా భవనంలో సంఘాల సభ్యులు మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వార్డు కౌన్సిలర్ సంగీతను ఆహ్వానించి సన్మానించారు.

● **కొడంగల్:** తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ మంగళవారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **యాలాల/పూడూరు:** మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా పూడూరు మండలంలోని మన్నెగూడలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో పార్టీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** ఎస్ఐ రవిగౌడ్ సుల్తాన్‌పూర్ ప్రజలకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు.

● **పూడూరు:** మేడిపల్లి కలాన్‌లో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో మంగళవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు.

● **మూడుచింతలపల్లి:** కొల్తూర్, అనంతారంలో మంగళవారం డీఎల్‌పీవో సాంబిరెడ్డి పర్యటించి రికార్డులను పరిశీలించారు.

● **తాండూరు రూరల్:** తాండూరు డివిజన్ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ సబ్‌ట్రెజరీగా ఆర్.వెంకటరమణ మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏటీవో అజ్మత్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సబ్‌ట్రెజరీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

● **ధారూరు:** సాఫ్ట్‌వేర్‌లో జరిగిన పొరపాటు వల్ల 71మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఈ సమస్యను పరిష్కరించాలని హరిదాసుపల్లి సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి మంగళవారం స్పీకర్ జి.ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

● **తాండూరు రూరల్:** మండల వ్యవసాయ శాఖ అధికారి(ఏవో) రజిత బదిలీ అయ్యారు. ఆమె పదేళ్లుగా మండల ఏవోగా సేవలందిస్తున్నారు. అదే విధంగా సిరిగిరిపేట్ క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ఏఈవోలు శిరీష, పర్వీన్‌లు కూడా బదిలీ అయ్యారు.

● **తాండూరు:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల చేరికల కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగరి వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యావ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు.

● **మోమిన్‌పేట్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎక్సైజ్ సీఐ సహజదేవుడు మత్తుపదార్థాల నివారణపై అవగాహన కల్పించారు.

● **వికారాబాద్/మర్పల్లి:** జిల్లాలో వికలాంగుల సదరం క్యాంప్‌నకు సంబంధించి నేడు(బుధవారం) మీ-సేవా కేంద్రాల్లో స్లాట్స్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంపులో ఆగస్టు 8, 16, 22, 29, 31, సెప్టెంబర్ 12, 19, 26, 28, 30 తేదీల్లో తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నిర్వహించే క్యాంప్‌లకు స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మర్పల్లిలోని సేవ కేంద్రాల్లో బుధవారం ఉదయం 11గంటల నుంచి సదరం శిబిరానికి దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం మధుకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **బషీరాబాద్:** స్థానిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడిని తిరిగి ఇక్కడికే పంపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు పలువురు విద్యాధికారి సుధాకర్‌రెడ్డికి మంగళవారం ఎమ్మార్సీ భవనం వద్ద వినతి పత్రం అందజేశారు.

● **బషీరాబాద్:** మంతట్టిలో మార్కెట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మహేందర్‌రెడ్డి, కొత్తగా వచ్చిన కార్యదర్శి అమృతప్పకు మాజీ సర్పంచ్ విబూది దశరథ్, ఎంపీటీసీ పతంగి శ్రీధర్, కార్యదర్శి శ్రీనాథ్‌లను శాలువా కప్పి సత్కరించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** ప్రభుత్వభూములను కబ్జాచేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ డీఎస్ రజిని హెచ్చరించారు. కాచవానిసింగారం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 66 ప్రభుత్వ భూమిని కబ్జాచేసి నిర్మించిన అక్రమనిర్మాణలను తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సాయిరామ్ కూల్చివేశారు. మూడు అక్రమ నిర్మాణాలు ఎక్సకవేటర్ల సాయంతో మంగళవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు

● **బొంరాస్‌పేట్:** అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దళితవాడ పాఠశాలలో, భవిత సెంటర్‌లో మంగళవారం విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ప్రకాశ్, శ్రీశైలం, సంతోష్, హరిలాల్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కీసర రూరల్, ఆగస్టు 6: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సైదులు(27) లారీ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక లారీలో వస్తూ కీసర సమీపంలోని పెద్దమ్మ చెరువు వద్దకు చేరుకున్నాడు. లారీ నుంచి డీజిల్ లీక్ అవుతుండటంతో రోడ్డు పక్కన లారీని నిలిపాడు. కిందకు దిగి సెల్‌ఫోన్ టార్చిలైట్‌తో సమస్యను గుర్తించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ లోగా మండల పరిధి అంకిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఓ రెడీమిక్స్ కంపెనీకి చెందిన లారీ వేగంగా వచ్చి నిలిపి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో లారీలో తలెత్తిన సమస్యను పరీక్షిస్తున్న సైదులుకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కీసర రూరల్, ఆగస్టు 6: ఒంటికి నిప్పంటించుకుని గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్‌నగర్‌కు చెందిన రాజు(38) కీసర మండల పరిధి యాద్గార్‌పల్లి గ్రామ శివారులో సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. గాయాలతో తల్లడిల్లుతున్న అతడిని పోలీసులు 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో చికిత్స పొందుతున్న అతడు మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీవోఏను వేధిస్తున్న ఐకేపీ సీసీపై కేసు

ధారూరు, ఆగస్టు 6: మండలంలోని తరిగోపులలో వీవోఏను వేధింపులకు గురిచేస్తున్న ఐకేపీ సీసీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తరిగోపులకు చెందిన ఓ మహిళ(29) భర్త చనిపోయిన తర్వాత తొమ్మిది సంవత్సరాల నుంచి ఐకేపీ వీవోఏగా పనిచేస్తోంది. కాగా పది నెలల కిందట తరిగోపులకు ఐకేపీ సీసీగా విధుల్లో చేరిన మోహన్ ఆమెతో చనువు పెంచుకున్నాడు. భర్తలేని మహిళ అని అవకాశంగా తీసుకుని తనతో ఉండాలని బాగా చూసుకుంటానని తరుచూ వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు మంగళవారం ఫిర్యాదు ఇవ్వటంతో సీసీ మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్న లోన్ చెల్లించలేదని తమ్ముడి ఫొటోలు మార్ఫింగ్

● నగ్న ఫొటోలు పంపి డబ్బులు డిమాండ్ ● సైబర్ నేరగాళ్ల నయా మోసం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. మీ అన్న మావద్ద లోన్ తీసుకున్నాడని, నువ్వు చెల్లించాలని తమ్ముడి ఫేస్ మార్ఫింగ్‌చేసి పోస్ట్‌చేసి పంపి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ విద్యాసంస్థలో చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మీ అన్న మా వద్ద లోన్‌యాప్ ద్వారా లోన్ తీసుకున్నారని, అతడు లోన్ చెల్లించడం లేదని తమ్ముడు విద్యార్థికి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేశారు. లోన్ డబ్బులు చెల్లించకపోతే నీ ఫేస్ మార్ఫింగ్ చేసి ఫొటోలను బంధువులు, స్నేహితులకు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. సదరు విద్యార్థి డబ్బులు చెల్లించేదిలేదని తేల్చిచెప్పడంతో సైబర్ నేరగాళ్లు అతడి ఫొటో మార్ఫింగ్ చేసి అతడి కాంటాక్ట్‌లోని అమ్మాయిలు, స్నేహితులకు నగ్న ఫొటోలు పంపించారు. దీంతో సదరు విద్యార్థి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6: గతంలో ప్లాట్లు విక్రయించి తిరిగి ప్లాట్లు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 10 పేరేడ్‌లో అదే గ్రామానికి చెందిన కటికం రాములు, కంట్లం శ్రీశైలంలు 1982లో వెంచర్ చేసి 180 ప్లాట్లు చేశారు. ఈ ప్లాట్లకు సంబంధించిన డబ్బులు తీసుకుని రూ.10 బాండ్ పేపర్లపై గ్రామస్తులకే విక్రయించారు. అప్పటి నుంచి వారు కబ్జాల్లో ఉంటూ పశువుల దొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. దీనిలో 15మందికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయగా, మిగతా వారి ప్లాట్లను కటికం రాములు తన కూమారులైన రాము, లక్ష్మణ్‌ల పేరుమీద జీపీఏ చేశాడు. అప్పటి నుంచి ఆయన కుమారులు ఈ ప్లాట్లు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని మంగళవారం ప్లాట్ల బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాట ఆడుతున్న పది మంది అరెస్ట్

తాండూరు రూరల్, ఆగస్టు 6: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో మంగళవారం పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపూర్ గ్రామానికి చెందిన కొత్త తుల్జప్ప, నందిగామ అమృతయ్య, నాగారం గోపాల్, అల్లకోడ్ పండరి, నాగారం లక్ష్మప్ప, జట్బారు గోవింద్, ఈడ్గి తుల్జారాంగౌడ్, ముళి రాజు, దండుగాళ్ల గైబప్ప, నర్సింహులు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కరన్‌కోట్ పోలీసులు పేకాటస్థావరంపై దాడులు చేసి పట్టుకుని వారి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.8900ల నగదు, రెండు పేకాట సెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రి, కుమారుడికి పాముకాటు

దోమ, ఆగస్టు 6: మండలంలోని బుద్లాపూర్ తండాలో సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తండ్రి సోమ్లనాయక్, కుమారుడు దినేశ్‌నాయక్‌లకు కట్లపాము కాటేసింది. కుమారుడి ఆరుపులతో ఒక్కసారిగా నిద్రలో నుంచి మేల్కొని చూడగా పాము ఇద్దరిని కాటేసి వెళ్తుండగా పామును చంపేశారు. అనంతరం పాముకాటుకు గురైన తండ్రి, కుమారుడిని కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం పరిగి ఆసుపత్రికి తరలించారు. దినేశ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కొల్తూర్‌లో బోర్ మోటారు, వైర్లు చోరీ

మూడుచింతలపల్లి, ఆగస్టు 6: కొల్తూర్ గ్రామంలో బోరు మోటారు, వైర్లు చోరీకి గురయ్యాయి. ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొల్తూర్ గ్రామానికి చెందిన దుర్గం నర్సింహులు తన పొలం వద్ద బోరుమోటరు దగ్ధమవడంతో సోమవారం సాయంత్రం రిపేరు చేయించుకుని పొలం గట్టున పెట్టి ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. తన పక్క పొలంలో మొలుగు లింగాలు అనే వ్యక్తి బోరుమోటారు వద్ద వైర్లు కూడా కనిపించకుండా పోయాయి. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మాపూర్ రెవెన్యూ సమస్యను పరిష్కరించాలి

మూడుచింతలపల్లి, ఆగస్టు 6: లక్ష్మాపూర్ రెవెన్యూ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని గ్రామ యువనాయకుడు క్యాతం మధుకృష్ణ కోరారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో జరిగిన రీ సర్వేలో భూమి హద్దులను సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం వల్ల సేత్వార్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై వెంటనే అధికారులతో మాట్లాడి లక్ష్మాపూర్ రెవెన్యూ సమస్యను పర్కిరించాలని కోరారు. అదేవిధంగా మూడుచింతలపల్లి మండలాన్ని యథావిధిగా మేడ్చల్ జిల్లాలోనే కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కొడంగల్ ఎస్ఐగా సత్యనారాయణ



కొడంగల్, ఆగస్టు 6: కొడంగల్ నూతన ఎస్ఐగా జీవీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో సహకరించాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

యాలాల, ఆగస్టు 6: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 8న నిర్వహించే రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోకు పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే. శ్రీనివాస్, యు.బుగ్గప్ప మాట్లాడుతూ.. పంచాయతీలో పనిచేస్తూ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, పీఎఫ్‌ఈఎస్ఐ లాంటి సౌకర్యాలకు నోచుకోక గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.51 మల్టీపర్పస్ వర్కర్ విధానం తీసుకొచ్చి వెట్టిచాకిరి చేయిస్తూ ఇబ్బందులపాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆరిఫ్, షబ్బీర్, ఆనందం, హన్మంత్, శ్యామమ్మ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.